నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 31 అక్టోబర్ 2024 | RANGAREDDY

ఎంపీ కనబడుటలేదు

హామీలిచ్చి పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ శ్రేణుల ఆరోపణ

చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 30 : చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరు నెలలుగా కనబడుటలేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ కనబడుటలేదని గురువారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చేవెళ్ల పార్లమెంట్ పరిధిని అభివృద్ధి చేస్తానని చెప్పడంతోపాటు చేవెళ్ల బీజాపూర్ రహదారిని అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బైపాస్ రోడ్డు పనులు చేస్తానని ప్రజలకు హామీలిచ్చి గెలిచిన తర్వాత ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతోపాటు ఎవ్వరికీ కనిపించకుండా పోవడమేంటని అవేదన వ్యక్తం చేశారు. ఉత్తుత్త హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం సరికాదన్నారు. ఎవరికైనా ఎంపీ కనిపిస్తే సమాచారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, దేవరంపల్లి సర్పంచ్ నరహరిరెడ్డి, ఆలూరు ఉపసర్పంచ్ వెంకటేశ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామగౌడ్, నాయకులు ఉన్నారు.

చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'భారం' తప్పించిన బీఆర్ఎస్..

విద్యుత్ చార్జీల పెంపును అడ్డుకున్నందుకు పలుచోట్ల బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టిన శ్రేణులు

'కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,500 కోట్ల విద్యుత్తు చార్జీల అదనపు భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. బీఆర్ఎస్ పార్టీ తరపున కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు.. ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి గట్టి వాదనలు వినిపించగా, విద్యుత్తు చార్జీల పెంపు ప్రతిపాదనను ఈఆర్‌సీ తిరస్కరించింది..' దీంతో ప్రజలపై అదనపు భారం పడకుండా కృషి చేయడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయ్యింది. దీంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం సంబురాలు నిర్వహించారు. అధినేత కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. వికారాబాద్, పరిగి, చేవెళ్ల తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు స్వీట్లు పంచిపెట్టడంతో పాటు పటాకులు కాల్చారు. వికారాబాద్‌లో బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, రాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కమల్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేక చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, నాయకులు దేవదాస్, శివ కుమార్, అశోక్, రమణ, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, గౌస్, అనంతయ్య, మల్లేశం, గాండ్ల మల్లికార్జున్, ద్యాచారం మల్లికార్జున్, ఫరీద్, మహిపాల్ రెడ్డి, సత్యయ్యగౌడ్, మూర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు. పరిగి, చేవెళ్ల తోపాటు పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 30

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ శ్రేణులు

ఫార్మాతో పండుగ పూట చీకటే..

పచ్చని పొలాల మధ్య ఫార్మా కంపెనీ నెలకొల్పాలన్న ప్రభుత్వ నిర్ణయం రైతులకు అశనిపాతంలాంటిది. దీంతో ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న ప్రజా జీవనం కాలుష్యం మధ్య కకావికలమవుతుంది. ఫార్మా కంపెనీలు కావాలని ఏనాడూ రైతులు కానీ, ప్రజలు కానీ కోరలేదు. కాంగ్రెస్ నాయకుల దుర్మార్గపు చర్యల వల్ల ఇక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. భూములు పోతాయనే ఆందోళన నేపథ్యంలో పండుగ జరుపుకోవాలన్న ఆసక్తి తగ్గింది. దీపావళి మాకు చీకటి రాత్రే.

– కుమ్మరి శివకుమార్, ఫార్మా బాధిత రైతు, హకీంపేట, దుద్యాల మండలం

ఫార్మా వల్ల సంబురాలు లేని దీపావళి

ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సమ్మతించి భూమిని అందిస్తే రూ.10 లక్షలు ఇస్తారంట. లేదంటే రూ.లక్ష లిచ్చి లాక్కొంటారంట. రూ.90 లక్షలు పలికే భూమికి రూ.10 లక్షలే ఇస్తామనడం ఎంతవరకు సబబు. ఉద్యోగాలు, ఇంటి స్థలం ఇస్తామంటూ మాయమాటలు చెబుతుండ్రు. ప్రభుత్వాన్ని మేము ఎలా నమ్మాలి. ఇక భూములు వదులుకొని మేము వలస వెళ్లాల్సిందేనా. ఇంత ఆందోళన మధ్య పండుగ ఎలా జరుపుకోవాలి. మాకు సంబురాలు లేని పండుగగా దీపావళి మిగిలిపోనున్నది.

– నీరటి హన్మంతు, లగచర్ల, దుద్యాల మండలం

పండుగ జరుపుకొనేదెలా..

రైతులు భూములను అప్పగించకుండానే ప్రభుత్వం రైతుల భూముల్లో డ్రోన్లతో సర్వేలు చేపడుతున్నది. అడ్డదారుల్లో భూములను లాక్కోనే యత్నం జరుగుతున్నది. ఈ విషయమై ఎవరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతున్నది. మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భూములు లేకుండా ఎలా బతకాలి. మా జీవనాధారం ఎలా గడవాలి. ప్రభుత్వమిచ్చే నష్టపరిహారం ఏ మూలకు సరిపోతుంది. ఇంతటి బాధ అనుభవిస్తూ పండుగ ఎలా జరుపుకోవాలి. మా బతుకుల్లో వెలుగులు కరువైన ఈ వేళ దీపావళి ఎలా అవుతుంది.

– రూప్లానాయక్, పులిచర్లకుంటతండా, దుద్యాల మండలం

ఇటు దామగుండం.. అటు ఫార్మా గండం

పండుగ సంతోషాన్ని కాంగ్రెస్ దూరం చేసిందని స్థానికుల ఆవేదన

పండుగంటే సంబురం.. పండుగంటే సంతోషం..ఇది గత సంవత్సరం వరకు.. బీఆర్ఎస్ హయాంలో ఒక పక్క అభివృద్ధి..మరో పక్క సంక్షేమం పకడ్బందీగా చేపట్టడంతో పండుగొస్తే పల్లె, పట్నం తేడా లేకుండా కొత్త సందడి కనిపించేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక పక్క అందని సంక్షేమ పథకాలు..మరో పక్క కనిపించని అభివృద్ధి పనులు..దీంతో పాటు స్థానికులు వద్దని ఉధృతంగా నిరసనలు చేస్తున్నా పట్టించుకోకుండా పచ్చని అడవిలో నేవీ రాడార్ స్టేషన్ చిచ్చు పెట్టగా పరిసర ప్రాంతాల వారు దానివల్ల జరిగే నష్టాలను తలచుకొని భయభ్రాంతులవుతున్నారు. అదే సమయంలో నమ్మి ఓటేసి గెలిపిస్తే, ముఖ్యమంత్రి అయిన తరువాత తమకు మంచి జరుగుతుందని భావించిన కొడంగల్ ప్రజలు ఇప్పుడు తల పట్టుకుంటున్నారు. దుద్యాల మండలంలో మాకు ఫార్మా పరిశ్రమలు వద్దు మొర్రో అని స్థానిక రైతులు నిరసన దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. ఫార్మా కోసం తమ భూములు ఎక్కడ తీసుకుంటారోనని భయపడుతూ అక్కడి రైతులు కాలం వెళ్లదీస్తున్నారు. బంధుమిత్రులతో పండుగ సంబురాలు జరుపుకోవాల్సిన సందర్భంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా సంబురాలకు దూరమై, సమస్యలతో సహజీవనం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని బాధపడుతున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)

పోలేపల్లి ఎల్లమ్మ సాక్షిగా రైతుల నిరసన (ఫైల్)

కాంగ్రెస్ హయాంలో సమస్యలు తప్ప సంబురాలు లేవంటున్న జిల్లావాసులు

ఇటు ఫార్మా కోసం భూములు లాక్కొంటారని ఆందోళన

అటు నేవీ రాడార్‌తో భవిష్యత్ భయం.. భయం

ముప్పని హెచ్చరించినా ముందుకే...

పూడూరు మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో వీఎల్ఎఫ్ రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తలు, అటవీ ప్రేమికులు గత కొన్నేళ్లుగా ఉద్యమిస్తున్నారు. ప్రకృతి సంపద నెలకొన్న దామగుండంలో రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయొద్దని ప్రజా సంఘాలు, మేధావులు, పార్టీల నాయకులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు స్వచ్ఛందంగా తరలివచ్చి సేవ్ దామగుండం పేరిట నిరసన వ్యక్తం చేస్తున్నారు. మూసీ, ఈసీ నదులకు పుట్టినిల్లు అయిన దామగుండాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని రాష్ట్రమంతటా పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు సేవ్ దామగుండం ఉద్యమానికి మద్దతు పలుకుతున్నారు. నేవీ రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుండడం, రాడార్ కేంద్రంతో ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం ముందుకెళ్తున్నది. ప్రజలు నమ్మి ఓటేసి గెలిపించిన స్థానిక ప్రజాప్రతినిధులే దగ్గరుండి భూమి పూజ చేయించడంపై స్థానికంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. అదేవిధంగా వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రంతో మూసీ నది ప్రమాదంలో పడనుందని, రాడార్ కేంద్రం ఏర్పాటుతో మూసీ నదికి మరణశాసనంగా మారనుందని పర్యావరణవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దామగుండం అడవుల్లో రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే నీటి ఊటలు మాయమవుతాయని, భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోనున్నాయని, మూసీకి నీళ్లు రావడం కష్టమేనని, మూసీ నది మనుగడ ప్రమాదంలో పడనుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రాడార్ కేంద్రం ఏర్పాటుతో మూసీ నదిని ఆదిలోనే అంతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా సుమారు 300 రకాల పక్షి జాతులు కూడా రేడియేషన్ ప్రభావంతో అంతరించిపోనున్నాయని పర్యావరణవేత్తల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలు..

సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మా విలేజ్‌కు ఆది నుంచి అడుగడుగునా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలు మాకొద్దంటూ రైతులు గత మూడు, నాలుగు నెలలుగా ఉద్యమిస్తున్నారు. భూములిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై భగ్గుమంటున్నారు. ఇటీవల భూములివ్వకపోతే ప్రభుత్వం భూములు లాక్కొని కంపెనీలు ఏర్పాటు చేస్తుందన్న దుద్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై రైతులంతా దాడి చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పారిపోయిన పరిస్థితి నెలకొన్నది, అంతేకాదు రైతుల నుంచి అతడిని కాపాడేందుకు పోలీస్ బెటాలియనే దిగివచ్చిందంటే ఫార్మా విలేజ్ ఏర్పాటును ప్రజలు ఏ స్థాయిలో వ్యతిరేకిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా ఎన్నో ఏండ్లుగా వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్న సాగు భూములను ఫార్మా కంపెనీలకు ఇవ్వమంటే ఊరుకునేది లేదని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. పచ్చని పొలాల్లో ఫార్మా కంపెనీలు పెట్టనీయబోమన్నారు. ఏడాదికి మూడు పంటలు పండిస్తూ సాఫీగా ఉంటున్న తమ కుటుంబాలను ఊర్లకు దూరంగా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలంటున్నారు. ఏటా వరి పంట సాగు చేస్తూ మేం తింటూ, పది మందికి అన్నం పెట్టే పచ్చని సాగు భూముల్లో కాలుష్యం వెదజల్లే కంపెనీలు ఏర్పాటు చేయడంపై కొడంగల్ నియోజకవర్గ రైతులు భగ్గుమంటున్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు చేసే మూడు గ్రామాల ప్రజలే కాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు కూడా ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తే వలసలు పోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బతుకులు ఆగం అవుతాయని, ముంబై, దుబాయ్ వలస వెళ్లడమే దిక్కవుతదని వాపోతున్నారు. మేం వేసిన ఓట్లతో రేవంత్ రెడ్డి సీఎం పదవి పొంది మమ్మల్ని రోడ్డు పాలు చేస్తామంటే ఊరుకునేది లేదని, తగిన బుద్ధి చెబుతామంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములను ఇచ్చేది లేదంటూ రైతులు భీష్మించుకుని ఉన్నారు.

ఇప్పటికే రైతులకు మద్దతుగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర, రోడ్లపై ధర్నాలు నిర్వహించారు. తమ గోడును కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి కూడా రైతులు తీసుకెళ్లారు. మూడు గ్రామాల రైతులు దుద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి రోజూ ఏదో రకంగా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్‌ను ఏర్పాటు చేయడం తగదు. ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు. రాడార్ ఏర్పాటుతో అనేక రోగాల బారిన పడే అవకాశమున్నదని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఉన్న చోట ఏర్పాటు చేయడాన్ని ఈ ప్రాంత ప్రజలు మొదటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి పలువురికి ఉపాధి కల్పించాలి. నేవీ రాడార్ ఏర్పాటు నేపథ్యంలో పలు ఇబ్బందులను ఎదుర్కోవల్సి వస్తుందనే ఆలోచనతో పండుగను కూడా ప్రశాంతంగా జరుపుకోలేని పరిస్థితుల్లో ఉన్నాం. ఇక్కడి నుంచి వలస వెళ్లాల్సి వస్తుందేమోననే ఆందోళనలో ఉన్నాం.

– టి.రాజేందర్, పూడూరు గ్రామం

రాడార్‌తో ప్రాణ సంకటం

దామగుండం అటవీ ప్రాంతంలో మేకలు, పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నేవీ రాడార్ ఏర్పాటు నేపథ్యంలో ప్రభుత్వం ఈ అడవిని నేవీకి అప్పగించింది. ఇప్పుడు అడవిలోకి వెళ్లే అవకాశమే లేదు. అలాగే అడవిలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాలన్న నేవీ అధికారుల పర్మిషన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిర్మాణం చేపట్టకుండా చూడాలి. దీపావళిని కూడా సంతోషంగా జరుపుకోలేని స్థితిలో ఉన్నాం.

– మధుసూదన్‌రెడ్డి, పూడూరు గ్రామం

నేవీ రాడార్.. మా బతుకు బేజార్..

దేశ రక్షణ పేరుతో దామగుండం అడవిలో చేపట్టే నేవీ రాడార్‌తో రేడియేషన్‌తో పలు వ్యాధులు సోకే అవకాశాలున్నాయి. అభివృద్ధి పేరిట మా ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. వేసవిలో చల్లటి వాతావరణంలో ఉండే మాకు గుబులు పుట్టిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని వేరే చోటకు తరలించాలి. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తాం. రాడార్ ఏర్పాటుతో మా బతుకు బేజార్ అవుతున్నది. ఏమి చేయాలో పాలుపోవడంలేదు. ఈ పరిస్థితుల్లో పండుగ కూడా సంతోషంగా జరుపుకోలేకపోతున్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, పూడూరు గ్రామం

వ్యాధుల బారిన పడతాం

పలు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించే అడవిలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం ఎందుకు. రాడార్ ఏర్పాటుతో స్వచ్ఛమైన గాలికి దూరమవుతాం. భవన నిర్మాణాలకు చెట్లను నరకడం.. రేడియేషన్ ప్రభావంతో కాలుష్యం పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నది. కనీసం ఆలయానికి వెళ్లాలన్న అధికారుల అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు. గ్రామాలు లేని ప్రాంతాల్లో నేవీ రాడార్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మానసికంగా మేము కుంగిపోతున్న పరిస్థితుల్లో దీపావళి జరుపుకోవాలన్న ఆసక్తి తగ్గింది.

– సతీష్‌పంతులు, పూడూరు గ్రామం

మళ్లీ.. మళ్లీ టెండర్లు

ముందుకురాని కాంట్రాక్టర్లు

నాలా అభివృద్ధి పనులకు స్పందన కరువు

బల్దియా పనులంటేనే జంకుతున్న కాంట్రాక్టర్లు

సకాలంలో బిల్లులు రావనే అపవాదే కారణం

మురుగు ముంపునకు పరిష్కారంగా ప్రతిపాదించిన వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదల జీహెచ్ఎంసీకి సవాల్‌గా మారింది. నాలా అభివృద్ధి పనులంటేనే కాంట్రాక్టర్లు జడిసిపోతున్నారు. దీనికి కారణం బల్దియాలో పనులు చేస్తే సకాలంలో బిల్లులు రావడం లేదన్న అపవాదు బలంగా ఉండటమే. గడిచిన కొన్ని నెలలుగా రూ. 1400 కోట్ల బకాయిలపై కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. తమ నిరసన గళాన్ని వినిపిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ నాలా అభివృద్ధి పనుల టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన రావడం లేదు.

-సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ)

ఒక్కొక్క పనికి రెండు, మూడుసార్లు టెండర్లు పిలుస్తున్న పరిస్థితి. సుమారు 542 కోట్లతో 43 ప్రాంతాల్లో 58 కిలోమీటర్ల మేర నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించిన బల్దియా ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఇందులో ఇప్పటివరకు తొమ్మిది చోట్ల మాత్రమే పనులు ప్రారంభమవ్వగా, విడుతలవారీగా టెండర్లు పిలుస్తూ వస్తున్నారు. తాజాగా కూకట్‌పల్లి, పటాన్‌చెరు, చందానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో నాలా అభివృద్ధి టెండర్లు పిలిచారు. ఎక్కువ శాతం ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. సకాలంలో పనులు ప్రారంభించి, వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులతో ఏం చేయాలో పాలుపోవడం లేదంటూ కొందరు ఇంజినీర్లు చెబుతున్నారు.

రూ. 30 కోట్ల లోపే..

ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు 'హెచ్ సిటీ'(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూపకల్పన చేసింది. ఇందులో కేవలం తొమ్మిది ప్రాంతాల్లో పనులు మొదలు కావడం, ఇందులో అత్యధికంగా రూ. 30 కోట్ల లోపు మాత్రమే ఉండటం గమనార్హం. పనులు ప్రారంభమైన వాటిని పరిశీలిస్తే చార్మినార్ జోన్‌లోని మౌలా కా చిల్లా నుంచి హైదరాబాద్ ఇస్లామిక్ పాఠశాల వరకు రూ.6.5 కోట్లతో బాక్స్ డ్రైన్, బండ్లగూడ జేఎన్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ నుంచి ఎర్రకుంట వరకు రూ. 33 కోట్లతో బాక్స్ డ్రైన్, సన్నీ గార్డెన్ నుంచి శివాజీనగర్ వరకు మూర్కీ నాలాకు ఇరు వైపులా రిటైనింగ్ వాల్‌కు రూ. 27.5 కోట్లు, నూరమ్మ చెరువు నుంచి మీరాలం ట్యాంక్ వరకు రూ. 53.35కోట్లు, అరుంధతినగర్ నుంచి అక్బర్‌నగర్ ఎగువకు రిటైనింగ్ వాల్‌కు రూ.9.9 కోట్లు, కిషన్‌బాగ్ రోడ్డులో మాజీద్ కిరాణా స్టోర్ నుంచి మూసీ వరకు వాల్ రూ.7.7 కోట్లతో పనులు జరుగుతున్నాయి. టెండర్ దశలో కేకే గార్డెన్ నందనపురి కాలనీ వరకు రూ. 7.49కోట్లతో డ్రైన్, శేరిలింగంపల్లి జోన్‌లో గఫూర్‌నగర్ జంక్షన్ నుంచి దుర్గం చెరువు ఎంట్రీ ప్లాజా వరకు ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్‌కు రూ.11.55 కోట్లు, అంబేద్కర్ కాలనీ నుంచి శిశుమందిర్ ఏరియా వరకు రూ.6 కోట్లు, జనార్దన్ హిల్స్ నుంచి ఖాజాగూడ పెద్ద చెరువు యూరో కిడ్స్ వరకు డ్రైన్ పనులకు రూ.14 కోట్లతో టెండర్ పిలిచారు. తాజాగా, మరిన్ని చోట్ల పనులకు కూడా టెండర్లు పిలిచారు. ఇదిలా ఉంటే ఈ వర్షాకాలంలో కొత్తగా ఏ ఒక్క ప్రాంతంలో వరద ముంపు సమస్యను తప్పించలేకపోయారంటూ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వాయువేగంతో ఎస్ఎన్‌డీపీ పథకాన్ని తీసుకొచ్చి.. రూ.985.45కోట్లతో మొదటి విడత పనులు చేపట్టింది. రూ.592.68 కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను పూర్తి చేసి ముంపు సమస్యలు తొలగించిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్నం సాగర్‌రహదారిపై ధర్నా..

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 30 : ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలోని సాగర్ రహదారిపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొని పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై సుమారు గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు